www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 24 ఫిబ్రవరి 2025

5

వైఎస్ఆర్

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ. విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10.00 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రజలు 08562-2444 37 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు.ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అధ్యక్షా..!

- 'ఉక్కు'పై స్పష్టత కరువు
- కదలని ఇరిగేషన్ పనులు
- నేటి నుంచి శాసనసభ సమావేశాలు

జిల్లా అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న సామెతను తలపిస్తోంది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో పాలక, ప్రతిపక్ష సభ్యులు జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై గళం విప్పాలి. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామనే హామీల అమలు చేయాలని పేర్కొన్న సంగతి తెలిసిందే. 2014లో విభజిత రాష్ట్రంలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శాసనసభ తొలి సమా వేశాల్లో ఒక్కో జిల్లాను తనదైన శైలిలో అభివృద్ధి చేస్తామని హామీల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. పదేళ్ల వ్యవధిలో పాలక పార్టీలైన టిడిపి, వైసిపి ఉక్కు పరిశ్రమ మొదలుకుని ఇచ్చిన హామీల్లో ఎటువంటి పురోగతి లేదు. గండికోట ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటరీలు, ఫీల్డ్‌కాల్వలు, లేక పోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. గాలేరు-నగరి ఫేజ్-2 పను లకు గ్రహణం వీడలేదు. కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతల పనుల్లో పురోగతి కనిపించలేదు. కడప సూపర్‌స్పెషాలిటీ నిపుణుల నియామకాలు, పరికరాల ఏర్పాటు, టెక్నీషియన్ల నియామకాలు ఎప్పుడు చేపడతారో తెలియడం లేదు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలో శాసనసభ సమావేశాల కోలాహలం నెలకొంది. ఈమేరకు కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు రాజధానులకు చేరుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప, అన్నమయ్య జిల్లాల్లోని 13 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను వైసిపి, రెండు శాసనసభ స్థానాలు మినహా మిగిలిన 11 స్థానాల్లో ఒక్కొక్కటి చొప్పున జనసేన, బిజెపి దక్కించుకోగా, మిగిలిన తొమ్మిది స్థానాల్ని టిడిపి కైవసం చేసుకుంది. ఈనేపథ్యంలో జిల్లా సమగ్రాభివృద్ధి బాధ్యత అధికార, ప్రతిపక్షాల భుజాలపై పడింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పైచేయి సాధించిన నేపథ్యంలో జిల్లా ప్రగతి పరుగులు తీయించాల్సిన బాధ్యత ఉంది. 2017 నవంబర్‌లో అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రలో మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్పత్తిని సైతం ప్రారంభిస్తామని హామీనిచ్చారు. కానీ ఆరేళ్లు గడిచిపోయినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనుల్లో నెలకొన్న స్తబ్ధతను తొలగించి, రాష్ట్రప్రభుత్వ వాటాను జత పరిచి పట్టాలెక్కించాల్సిన అవసరం ఉరుముతోంది.

రాయలసీమకు గండికోట ప్రాజెక్టు గుండెకాయ. గత మూడేళ్లుగా గండికోట ప్రాజెక్టును 26.86 టిఎంసిలతో నింపుతున్నారు. కానీ నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. 1994 నుంచి 23 గ్రామాల వారికి పునరావాస సదుపాయం కల్పన సాగుతూనే ఉంది. ఆరేళ్లుగా గాలేరు-నగరి ఫేజ్ - 2 పనులకు గ్రహణం తొలగడం లేదు. కడపలో రూ.12 కోట్లతో ఫుడ్‌పార్కును ఏర్పాటు చేస్తానని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పదేళ్లుగా ఫుడ్‌పార్కు కాగితాలకే పరిమితమంది. ఫుడ్‌పార్క్ ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేది.ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని కొర్రపాడు రోడ్డు సమీపంలో 76. 17 ఎకరాలను 47 ప్లాట్లుగా విభజించిన సంగతి తెలిసిందే. రూ.55 కోట్లతో అపెరల్ పార్కు పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో చేనే తలు ఉన్న సంగతి తెలిసిందే. 2005-06లో మాజీ సిఎం కీ.శే వైఎస్ఆర్ మైలవరం మండలంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు. సుమారు 60 ఎకరాలను 128 ప్లాట్లుగా విభజించారు. రూ.7.4 కోట్లతో పనుల పురోగతి అంతం తమాత్రమే.

కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సిఎం చంద్రబాబు (ఫైల్‌ఫోటో)

పులివెందుల సమీపంలో రూ.396 కోట్లతో 644 ఎకరాల్లో అంత ర్జాతీయ పశుపరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎపి కార్ల్‌లో రూ. 255 కోట్లతో పరిపాలనా భవనానికి వ్యయం చేశారు. గత బడ్జెట్‌లో పరిశోధనలకు అరకొర నిధులు కేటాయించారు. ఇక్కడ అంతర్జాతీయ స్థాయిలో సుప్రసిద్ధ పశు వుల పిండాలను సంకరీకరణ ద్వారా వాతావరణానికి తట్టుకోగల నూతన జాతి పశువులను సృష్టించడానికి చర్యలు తీసుకున్నారు. దానికి పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపులు చేయాల్సి ఉంది యోగి వేమన యూనివర్శిటీపై చిన్నచూపు కొనసాగుతోంది. 2008లో రూ.100 కోట్ల వ్యయంతో యూనివర్శిటీ స్థాపనకు శ్రీకారం చుట్టారు. మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ఆర్ హయాంలో పీజి సెంటర్ యోగి వేమన యూనివర్శిటీగా మార్చి పెద్దఎత్తున నిధులు కేటాయించారు. అంత ర్జాతీయ ప్రమాణాలు కలిగిన యూనివర్శిటీగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆర్ట్స్‌తోపాటు పలు విభాగాలకు చెందిన భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించాల్సి ఉంది. రాజంపేటలో హార్టీకల్చర్ యూ నివర్శిటీ ఏర్పాటు చేస్తున్నామని హామీ నీరు గారిపోయింది. రైల్వేకోడూరు ప్రాంతంలో ఎక్కువగా వాణిజ్య పంటల వ్యాపారం సాగుతోంది. టిడిపి హయాంలో ఎమ్మెల్యేగా గెలిచిన మేడా నందలూరు ప్రాంతంలోని 200 ఎకరాల్లో హార్టీకల్చర్ యూనివర్శిటీ మంజూరు చేయిస్తానని ప్రకటించారు. ఈమేరకు ప్రభుత్వ అధినేత నుంచి హామీ సైతం పొందారు. అనంతరం దీని గురించి మరిచిపోయారని తెలుస్తోంది. గండికోట పర్యాటక ప్రాజెక్టును గ్రేటర్ క్యానాన్ తరహాలో అభివృద్ధి చేస్తామని ఊదరగొట్టారు. రూ.500 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దుతా మని గండికోట ఉత్సవాలకు హాజరైన అప్పటి టిడిపి హయాంలో మంత్రులు హడావుడి చేశారు. గండి కోటలో స్కైవాచ్ సదుపాయం కల్పిస్తానని హామీనిచ్చారు. జిల్లాలో అసంపూర్తిగా, అమలుకు నోచుకోని అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చకు తీసు కొచ్చి జిల్లాను అభివృద్ధిపథంలోకి నడిపించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

కడపకు తాగునీటిని అందించాలి

కడప నగరానికి తాగునీటిని అందించడమే ఏకైక ధ్యేయంగా ముందుకు సాగుతున్నా. లింగంపల్లి, వాటర్‌గండిలో పైపులైన్ సమస్య వేధిస్తోంది. ఫలితంగా రెండ్రోజులకు ఒకసారి తాగునీరు అందడం గగనంగా ఉంది. షామీరియా బ్రిడ్జిని సత్వరమే పూర్తి చేయాలని కోరతా.

- మాధవి, ఎమ్మెల్యే, కడప.

కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ హబ్ ఏర్పాటు చేయాలి

కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎలక్ట్రానిక్ హబ్ ఏర్పాటు చేయాలి. బ్రహ్మంసాగర్ నుంచి కొప్పర్తి పైప్‌లైన్ నిధులను జిఎన్ఎస్ఎస్ కెనాల్ పనులకు ఖర్చు చేస్తే కొప్పర్తితోపాటు కడప నగరానికి శాశ్వతంగా తాగు నీటిని అందించొచ్చు.

- పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్యే, కమలాపురం.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

- ఉదయం పరీక్షకు 87.7 శాతం, మధ్యాహ్నం 87.48 శాతం హాజరు

ప్రజాశక్తి - కడప

జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగింది. అరగంట ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఎస్‌పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్, నెట్ సెంటర్లను మూత వేయించారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు, మొబైల్ ఫోన్లు వంటి వాటిని పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా పోలీసులు తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 5,825 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం సెషన్‌లో 5,111 మంది హాజరయ్యారు. హాజరు శాతం 87.74 శాతంగా నమోదైంది. మధ్యాహ్నం సెషన్‌లో 5,825 మందికి గాను 5,096 మంది హాజరయ్యారు. 87.48 శాతంగా నమోదైంది. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని డిఆర్ఒ విశ్వేశ్వరరావు తనిఖీ చేశారు. కేంద్రంలో అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన అన్ని వసతులను పరిశీలించారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించాయని ఆయన చెప్పారు.

పరీక్షలను పర్యవేక్షిస్తున్న డిఆర్ఒ

అభ్యర్థులను తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతిస్తున్న పోలీసులు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌జెడి రవి పేర్కొన్నారు. ఆదివారం సెయింట్ జోసెఫ్ జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్షలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సర మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు విధి విధానాలను, ఎగ్జామ్ సెంటర్‌లో కల్పించాల్సిన మౌలిక వసతులు, పర్యవేక్షణ, విద్యార్థులకు ప్రశాంతంగా, పారదర్శకంగా పరీక్షలు రాయడానికి సియస్, డిఒలు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సిసి కెమెరా పర్యవేక్షణలో ఎలాంటి అవకాశాలకు తావుల ేకుండా పరీక్షలు నిర్వహించి, వైఎస్ఆర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ఆర్ఐఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 08562- 244171లో సంప్రదించి ెగిన సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఆర్ఐఒ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఇంటర్ బోర్డు సూచనలను పాటిస్తూ విధులు నిర్వహించాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిఇసి మెంబర్లు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సవరణలను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

భారతీయ బీమా మార్కెట్లోకి పూర్తిస్థాయి విదేశీ బీమా కంపెనీలను అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతిపాదనలని నిరసిస్తూ ఆదివారం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, కడప డివిజన్ ఆధ్వర్యంలో కడప ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ ప్రాంగణంలో ఎల్‌ఐసి సిబ్బంది నిర్వహించిన బ్యానర్‌పై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సంఘం జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అక్బర్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మద్దతుగా సంతకాలు చేసిన రాష్ట్ర పర్యాటకశాఖ రిటైర్డ్ డైరెక్టర్ గోపాల్, ప్రముఖ వైద్య నిపుణులు మహబూబ్ బాషా, వైవీయూనివర్శిటీ ప్రిన్సిపల్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పూచి ఉన్న, దశాబ్దాల విశ్వసనీయత ఉన్న, సామాజిక బాధ్యత ప్రదర్శిస్తున్న ఎల్‌ఐసికి పోటీగా అమెరికాలో దివాలా తీసిన ఎఐజి, గోల్డ్ మెన్ సాక్స్లాంటి విదేశీ కంపెనీలను మన గడ్డపైకి అనుమతించాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐసి సంఘాల నేతలు రఘునాథ రెడ్డి, సుధీకర్ పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

- మహిళా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు

- ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళలు, బాలికలపై దాడులను అరికట్టాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .మహిళా సమస్యల పరిష్కారం కోసం ఐద్వా పోరాటాల నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం 5వ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్ సుబ్బమ్మ అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడూ స్పందించాలని పిలుపునిచ్చారు. ఐద్వాను మరింత విస్తరించాలని చెప్పారు. మహిళలపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేస్తామని చెబుతున్న ప్రభుత్వం కనీసం కుటుంబం గడవడానికి ఆసరా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పావలా వడ్డీ, వడ్డీరే నిరుణాలు అటకెక్కాయని విమర్శించారు. మైక్రో ఫైనాన్స్ ఆగడాలు మళ్లీ మొదలయ్యాయని కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటా బయటా మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస వ్యక్తిగత వ్యవహారం కాదని, సమాజం, కుటుంబం, న్యాయ వ్యవస్థ, ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థ మహిళలకు న్యాయం, భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళాకర్షణ పథకాలతో నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని వాపోయారు. ఇప్పటికైనా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ హామీలన్నింటిని తక్షణమే అమలు చేయడానికి చర్యలు ప్రారంభించాలని లేనిపక్షంలో రానున్న కాలంలో ఐద్వా సంఘంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి. లక్ష్మిదేవి, జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, జమీల, గౌసియా బేగం, బద్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు మోక్షమ్మ, ఖైరుణ్ బీ, ఊటుకూరు బాలమ్మ, మస్తాన్ బీ, రత్నమ్మ, సిద్దమ్మ, సుబ్బలక్షుమ్మ ముండ్లపాటి రాధమ్మ, లక్ష్మీదేవి రానేమ్మ వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

సమకాలీన సమాజానికి అద్దం పట్టే 'ఇనాక్' నవలలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆధునిక సమాజంలోని సమస్యలకు అద్దం పట్టేలా ఆచార్య కొలకలూరి ఇనాక్ నవలలు ఉంటాయని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి జి.రమేశ్ బాబు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 141 వ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి అధ్యక్షత వహించగా, 'ఆచార్య కొలకలూరి ఇనాక్ నవలా సాహిత్యం' అనే అంశంపై జి.రమేష్ బాబు ప్రసంగించారు. సభాధ్యక్షులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ ఇనాక్ నవలలకు సమకాలీన సమాజానికి మధ్య సంబంధాలేంటి, నవలల్లో ఎలాంటి జనజీవనం ఉంది లాంటి అనేక విషయాలు ఈ సదస్సు ద్వారా చర్చకు వస్తాయన్నారు. 'ఎక్కడుంది ప్రశాంతి' నవలలో ఇనాక్ రాయలసీమ ప్రకృతిని చక్కగా విశ్లేషించారన్నారు. రాయలసీమ వాతావరణంపై బుచ్చిబాబు తరువాత నవలల్లో ప్రస్తావించిన రెండవ రచయితగా ఇనాక్‌ను చూడాలన్నారు. సభను డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి సమన్వయం చేశారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త జి.రమేష్ బాబుని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది కలిసి సత్కరించారు. కార్యక్రమంలో గుర్రాల గోపాల్, కొత్తపల్లె రామాంజనేయులు, రాజారెడ్డి, కరీముల్లా, సాయిబాబా, తేజ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల (కాశినాయన) : కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జల్లా ఉపాధ్యక్షులు ఎన్. బైవర ప్రసాద్ పేర్కొన్నారు. పోరుమామిళ్లలోని వివేకానంద భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో పోరుమామిళ్ళ ప్రయివేట్ ఎలక్ట్రిషియన్ వర్కర్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎలక్ట్రిషియన్లు ప్రభుత్వం ద్వారా పొందిన గుర్తింపు కార్డులను ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయించుకోవాలని, లేదా ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. కార్మికునికి ప్రమాద భృతి కింద రోజుకి రూ. 800 గరిష్టంగా 15 రోజులు పాటు రూ. 12000 చొప్పున ఆర్థిక సాయం ఇవ్వాల న్నారు. ప్రయివేట్ ఎలక్ట్రిషియన్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గాజులపల్లె సూర్యకుమార్, ప్రధాన కార్యదరిగ్గా షేక్ మహబుబ్ వళి, కార్యవర్గ సభ్యులుగా కిరణ్ బాష, పెద్ద మస్తాన్, చిన్న ఉసేన్ పీరా, సీతా ప్రతాపు చిన్న రఫీ ఇమ్రాన్ మద్దు రమణ ఎస్. బాష, కోశాధికారిగా మల్లికార్జున, 13 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రయివే ఎలక్ట్రిషన్ యూనియన్ నాయకులు విట్టా నారాయణ, వెంకటరెడ్డి, వంద మంది ఎలక్ట్రిసియన్లు పాల్గొన్నారు.

వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా కొప్పల శివ యాదవ్

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా కడప నియోజకవర్గానికి చెందిన కొప్పల శివ యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి సంఘాలలో దశాబ్దల కాలం నుంచి చేసిన ఎనలేని సేవలను గుర్తించి పదవి ఇచ్చిన జగన్‌కు, జిల్లా అధ్యక్షులు పోచం రెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డికి, ఎంపీ అవినాష్‌రెడ్డికి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజద్ బాషాకు, నగర మేయర్ సురేష్ బాబుకు, బిసి సెల్ రాష్ట్ర అధ్యఉలు రాచగొల్ల రమేష్ యాదవ్‌కు ఆయన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతను పార్టీ అభ్యున్నతి కోసం, ప్రజా సంక్షేమం కోసం, ముఖ్యంగా కిందిస్థాయిలో పార్టీకి మూల స్తంభాల లాంటి కార్యకర్తల కోసం వెచ్చిస్తానని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు సయ్యద్ ఖాజా మైనుద్దీన్

ప్రజాశక్తి - కడప : జాతీయస్థాయి 'యంగ్ ఇండియా కె బోల్ ఢిల్లీ పోటీలకు కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు సయ్యద్ సయ్యద్ ఖాజా మైనుద్దీన్ ఎంపికయ్యారు. విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్ర రత్న భవన్‌లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యంగ్ ఇండియా కే బోల్ సీజన్ -5 ' రాష్ట్ర స్థాయి స్పీచ్ కాంపిటీషన్లో మొదటి స్థానంగా రూ.10,000 నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను పొందారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖాజా మైనుద్దీన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ సమస్య నిర్మూలించాలన్నారు. యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వాడకం తగ్గించాలి అని, భారత రాజ్యాంగం సక్రమంగా అమలు చేయాలన్నారు. తన గెలుపుకు సహకరించిన కడప జిల్లా, నగర అధ్యక్ష, అధ్యక్షులు, కాంగ్రెస్ కమిటీ నాయకులు, అనుబంధ సంఘాలు,సభ్యులు, కార్యకర్తలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

ప్రజాశక్తి -కడప : ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి సెషన్ల ప్రారంభం సందర్భంగా ప్రజా సమస్యలపై పోరాడాలని ని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలిలలో రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం, ప్రాథమిక సదుపాయాల వంటి ప్రాధాన్య సమస్యలను చర్చించి, వాటి పరిష్కారాలకు శాసనమండలి వేదికను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. ప్రత్యేకంగా కడప పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ నియోజకవర్గాల్లోని ప్రజల ఆందోళనలు, అవసరాలను ప్రతిబింబించేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - గోపవరం : బద్వేలు డిపో నుంచి పుణ్యక్షేత్రాలైన మల్లంకొండ, లంకమల, ఎన్.ఎస్ మఠం, బ్రహ్మంగారిమఠంలకు స్పెషల్ సర్వీస్ బస్సులను ఏర్పాటు చేశామని, ప్రయాణికులు ఉపయోగించుకోవాలని ఆర్‌టిసి డిఎం నిరంజన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యంగా మైదుకూరు రోడ్డు నందిపల్లి వద్ద ఒక పాయింట్‌ను, నెల్లూరు రోడ్డు పిపి కుంట వద్ద ఒక పాయింట్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో బిఎస్ నాయక్, ఇ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభ్యర్థులతో చెలగాటం తగదు

ప్రజాశక్తి - కడప : గ్రూప్ -2 అభ్యర్థులతో ప్రభుత్వం చలగాటం మంచిది కాదని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రూప్-2 పరీక్షలను రోస్టర్ విధానంలో లోపాలు ఉన్నప్పటికీ, అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా పరీక్ష నిర్వహించడంపై రాష్ట్రవ్యాప్తంగా యువజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అన్నారు. గ్రూప్ -2 మెయిన్ పరీక్షను తక్షణం రద్దు చేయాలని, పారదర్శకమైన విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని అల్మాస్‌పేటలో ఉన్న జామియతుస్సాలిహత్ మదరసా లో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం. మధుసూదన్ రెడ్డి, డాక్టర్ కె. రేణుక, డాక్టర్ నవీద్ బాష, డాక్టర్ మొహమ్మద్ ఫర్హానుద్దీన్, డాక్టర్ అబ్దుల్ మజీద్ ఖాన్ మయాన, డాక్టర్ రేష్మ పర్వీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఎఫ్.ఎం. ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ పేదలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం

ప్రజాశక్తి - కడప

వక్ఫ్ సవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చర్చా వేదికలో వక్తలు అన్నారు. రాబోవు రోజుల్లో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చా వేదిక కార్యక్రమం ఏఐసిసి కో-ఆర్డినేటర్ ఎస్.ఎ. సత్తార్ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రెవల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ-సుబ్బరాయుడు, కాంగ్రెస్ పార్టీ కడప కో- ఆర్డినేటర్ బండి జక రయ్య, జిల్లా కార్యదర్శి-గౌస్పీర్, ఎస్ సి, ఎస్ టి హ్యూమన్ రైట్స్-జెవి రమణ, బిసి మహాసభ-అవ్వారు మల్లికార్జున,సిరాజుద్దీన్, కైపు రామాంజనేయులు, హరి ప్రసాద్, చాంద్‌బాషా మాట్లాడుతూ రాజులు, నవాబులు , ధనవంతులు వక్ఫ్ కోసం భూములు ఇతర ఆస్తులు వందల సంవత్సరాలుగా దానం ఇస్తూ వచ్చారు అన్నారు. ఈ వక్ఫ్ ఆస్తుల ఆదాయాన్ని విద్యాసంస్థలు, శ్మశాన వాటికలు, మసీదులు, అనాథ శరణాలయాలు తదితర వాటి నిర్వహణకు వినియోగిస్తారు అని తెలిపారు. దీని వల్ల ముస్లిములకు ప్రయోజనం చేకూరుతుంది అన్నారు. వక్ఫ్ చట్టాన్ని బలహీనపరచడమే మతోన్మాద బిజెపి లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సవరణ బిల్లు పార్లమెంటులో మొదటిసారి ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ఇండియా కూటమిలోని పార్టీలు పెద్ద ఎత్తున వ్యతిరేకించడం వలన జాయింట్ పార్లమెంటు కమిటీ ఏర్పాటు చేశారు అని తెలిపారు. బిల్లు విషయంలో టిడిపి, వైఎస్ఆర్‌సిపి, జనసేన పార్టీలు తమ వైఖరి ఏమిటో ప్రజలకు స్పష్టం చేయాలి పని కోరారు.

చదువుల పట్ల అప్రమత్తత అవసరం

- భవిష్యత్‌లో నీట్, జెఇఇ, ఇఎపి సెట్లకు శిక్షణ!
- కెరీర్ గైడెన్స్ తరగతుల షెడ్యూల్ కసరత్తు పూర్తి
- గురుకులాల్లో ఆరు అదనపు వాష్‌రూములు ఏర్పాటు
- జిల్లా గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ ఎ.ఉదయశ్రీ వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

విద్యార్థుల చదువుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. జిల్లాలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనలో గురువుల బాధ్యతతోపాటు తల్లిదండ్రులూ అంతే బాధ్యతగా వ్యవహరిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యం. 100 రోజుల యాక్షన్‌ప్లాన్ పేరుతో పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఫలితాల సాధనకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ఇందుకు అనుగుణంగా విద్యార్థుల్లో ఆత్మవి శ్వాసాన్ని పెంపొం దించడానికి ఉద్దేశించి కెరీర్‌గైడెన్స్ తరగుతులను నిర్వహి స్తున్నాం. ఇంతటితో ఆగకుండా పబ్లిక్ పరీక్షల అనంతరం మెరుగైన ఫలితాలు సాధించిన వారిలో సెలెక్టివ్ ప్రాతిపదికన నీట్, జెఇఇ, ఇఎపిసెట్ల ప్రిపిరేషన్‌కు ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయం కల్పించే ఆలోచనలు చేస్తు న్నామని పేర్కొంటున్న గురుకుల పాఠశాలల కో-ఆ ర్డినేటర్ ఎ .ఉదయశ్రీతో ముఖాముఖి..

ముఖా ముఖి..

పబ్లిక్ పరీక్షల సన్నద్ధత గురించి తెలపండి?

జిల్లాలోని గురుకుల పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీఅవర్స్ నిర్వహిస్తున్నాం.100 రోజుల్లో 100 శాతం ఫలితాల సాధనపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. రోజూ ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం 9.30 గంటల వరకు షెడ్యూల్ వారీగా నిపుణులైన ఉపాధ్యాయులు, లెక్చరర్ల పర్యవేక్షణలో స్టడీఅవర్స్, మాక్ పరీక్షల నిర్వహణ ద్వారా సిద్ధం చేస్తున్నాం.

గురుకుల పాఠశాలల వివరాలు చెప్పండి?

కడప, అన్నమయ్య జిల్లాల్లో 24 గురుకుల పాఠశాలలున్నాయి. కడప జిల్లాలో బి.మఠం, చిన్నచౌక్, సగిలేరు, కమలాపురం, గండి, తొండూరు, గుండ్ల కుంట, ఎంవిపల్లి, రాజుపాలెం, పులివెందులలో రెండు, కొండాపురం, అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, బి.కొత్తకోట, రామాపురం, ఆడపూరు, బుర్రకాయలపేట, దేవపట్ల, ఎల్ఆర్‌పల్లి, మదనపల్లి, పీలేరు, రాయచోటి, వాల్మీకిపురం ప్రాంతాల్లో గురుకులాలున్నాయి.

పబ్లిక్ పరీక్షలకు హాజరు వివరాలు తెలపండి?

కడప, అన్నమయ్య జిల్లాల వ్యాప్తంగా 11,483 మంది పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది. కడప జిల్లాలోని 13 గురకుల పాఠశాలల పరిధిలోని 6,034 మంది, అన్నమయ్య జిల్లా లోని 11 గురుకుల పాఠశాలల పరిధిలోని 5,449 మంది పరీక్షలకు హాజరవుతారు.

పబ్లిక్ పరీక్షల ఫలితాలపై అంచనాలేమైనా ఉన్నాయా?

గతేడాది టెన్త్, ఇంటర్ ఫలితాల్లో కడప, అన్నమయ్య జిల్లాలు 10వ స్థానంలో నిలిచాయి. ఇందులో కడప జిల్లా టెన్త్‌లో 97 శాతం, అన్నమయ్య జిల్లా 92 శాతం, జూనియర్ ఇంటర్‌లో కడప జిల్లా 65 శాతం, సీనియర్ ఇంటర్‌లో 72 శాతం, అన్నమయ్య జిల్లా జూనియర్ ఇంటర్‌లో 81 సీనియర్ ఇంటర్‌లో 90 శాతం ఫలితాలు సాధించింది. గతేడాది ఫలితాలను అధిగమించే ప్రయత్నం చేస్తాం.

వృత్తివిద్యాకోర్సుల్లో రాణించడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెడిసిన్, ఇంజినీరింగ్, సిఎ వంటి వృత్తివిద్యా కోర్సుల్లో రాణించడానికి నీట్, జెఇఇ, ఇఎ పిసెట్ వంటి పోటీ పరీక్షలను ఎదుర్కో వడానికి ఉద్దేశించి ఆన్‌లైన్‌లో బోధనా తరగతులను నిర్వ హించాలనే ఆలోచన ఉంది.

పబ్లిక్ పరీక్షల సన్నద్ధతలో భాగంగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

పబ్లిక్ పరీక్షల సన్నద్ధతలో భాగంగా గురు కుల పాఠశాలల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి ఉద్దేశించి కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహిస్తున్నాం. ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు ఇంటర్ విద్యార్థులకు, అనంతరం టెన్త్‌క్లాస్ విద్యార్థులకు తరగతులు షెడ్యూల్ ఫాలో అవుతున్నాం.

గురుకులాల్లో సదుపాయాల గురించి తెలపండి?

కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ప్రతి గురుకుల పాఠశాలలో ఆరు చొప్పున అదనపు వాష్‌రూములు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్లు చనిపోతున్న నేపథ్యంలో చికెన్ ధరకు అనుగుణంగా బిస్కెట్లు, పాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఉన్నాం.

గురుకులాల అభివృద్ధి పనులపై మాట్లాడండి?

పదేళ్ల కిందట కడప, అన్నమయ్య జిల్లాలోని గురుకుల పాఠశాలలో అదనపు భవన నిర్మాణాలను ఎపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చేపట్టింది. అనంతరం అదనపు భవన నిర్మాణాలు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటి వివరాలపై స్పష్టత కొరవ డింది.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

శివ భక్తేంద్ర స్వామి చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని శివ భక్తేంద్ర ఆలయంలో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి రచించిన శ్రీశివ భక్తేంద్రస్వామి చరిత్ర పుస్తకా ఆవిష్కరణ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, విశిష్ట అతిథిగా ఎపిఎస్ఆర్‌టిసి మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ తవ్వా వెంకటయ్య, తుడమలదిన్నె సర్పంచు కృష్ణారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి, కళాకారులు, శివ భక్తేంద్ర స్వామి కుటుంబికులు, రావులపల్లి ఎంపి టిసి కనపర్తి సుబ్బారెడ్డి, మైదుకూరు నియోజకవర్గ వైసిపి రైతు విభాగం అధ్యక్షులు జి.నాగిరెడ్డి, స్వామి శిష్యులు గురివిరెడ్డి పాల్గొన్నారు. శివ భక్తేంద్ర స్వామి భక్తులు అతిథులను శాలువాతో ఘనంగా సత్కరించారు.

'సీమ' మనోభావాలు దెబ్బతీయొద్దు

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని విజయవాడలో పెట్టి రాయలసీమ ప్రజల మనోభావాలను దెబ్బ తీయవద్దని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని విజయవాడలో కాకుండా రాయలసీమ ప్రాంతంలోని శ్రీశైలం, కర్నూల్ నగరానికి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విభజన చట్టంలో సెక్షన్ 85 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజుల లోపు కృష్ణా బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని ఉందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు, గతంలో జగన్ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పదేళ్లయినా బోర్డు కార్యాలయం హైదరాబాద్‌లో ఉండడం శోచనీయమన్నారు. బోర్డు కార్యాలయాన్ని విజయవాడకు మార్చాలని ఇటీవలనే బోర్డు యాజమాన్యం, చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించడం సమంజసం కాదన్నారు. పరిపాలనా సౌలభ్యం, అధికార వికేంద్రీకరణ, రాయలసీమ ప్రజల మనోభావాల దృష్ట్యా బోర్డు కార్యాలయాన్ని శ్రీశైలం, కర్నూలులోగాని ఏర్పాటు చేయాలని తులసిరెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

శేష వాహనంపై వీరభద్రస్వామి దర్శనం

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా పది రోజులపాటు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు ఆదివారం శేష వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ పివి నారాయణ యాదవ్, కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ముగిసిన ఆవులస్వామి ఆరాధన


ప్రత్యేక పూజలో ఎంపీ వై.ఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - లింగాల

అంబకపల్లె ఆవులస్వామి ఆరాధన ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం టిడిపి సీనియర్ నాయ కులు మారెడ్డి భరత్‌కుమార్ రెడ్డి, మండల ఇన్‌ఛార్జి దేవిరెడ్డి సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు రూరల్ పరిధి ఆర్టీపీపీ రోడ్డులోని శ్మశాన వాటిక సమీపంలో ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక రూరల్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఆర్టీపీపీలోని ఫ్లైయాష్ కోసం వెళుతున్న సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. మృతుడు ఆళ్లగడ్డకు చెందిన గైబు(34)గా పోలీసులు గుర్తించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని చిలమకూరు గ్రామంలో ఈనెల 15న జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంభం శివరామిరెడ్డి(56)అనే వ్యక్తిని దారుణంగా హత్య చేసి తప్పించుకునే ప్రయత్నం చేయగా.. పోలీసులు కనిపెట్టి వారిని అరెస్టు చేశారన్నారు. శివరామిరెడ్డి అదే గ్రామానికి చెందిన మహిళలో వివాహేతర సంబంధం రెండేళ్లుగా కొనసాగిస్తున్నాడు. ఇటీవల సదరు మహిళ ఆదెన్న అనే మరో వ్యక్తితో చనువుగా ఉండడాన్ని గమనించిన శివరామిరెడ్డి ఇద్దరినీ మందలించాడు. ఇది మనసులో పెట్టుకున్న వారిద్దరూ శివరామిరెడ్డిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని, హత్య చేసేందుకు పథకం పన్నారు. సదరు మహిళ ఈనెల 15న రాత్రి సమయంలో శివరామిరెడ్డిని ఇంటికి పిలిపించుకుంది. ముందుగా ఏర్పాటు చేసుకున్న కారంపొడిని అతని కళ్లల్లోకి కొట్టడం, వెంటనే తాడు మెడకు బిగించి చంపేశారు. శివరామిరెడ్డి చెప్పులు, సెల్‌ఫోన్, చంపేందుకు ఉపయోగించిన తాడును కాల్చి బూడిదను కాలువలో వేశారు. మృతదేహాన్ని మల్లెల ఘాటులో పడేశారు. శివరామిరెడ్డి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో సిఐ నరేష్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.

అనుమానమొస్తే ఫిర్యాదు చేయండి : డిఎస్‌పి

ఇంట్లో వ్యక్తి ఎక్కువ సమయం వరకు రాకపోతే, ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిఎస్‌పి ప్రజలకు సూచించారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

మోటర్ వేస్తేనే బాత్రూంలోకి నీరు

ఇక్కట్లు పడుతున్న బాలికలు - ట్యాంక్ నుంచి నీరు వృథా

లీక్ అవుతున్న పాఠశాలపై నిర్మించిన నీటి ట్యాంకు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బాలికలకు నీటి కష్టాలు తప్పడంలేదు. పాఠశాలలో దాదాపు 850 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాలలో ఉన్న బాత్రూంలో నీరురాక వారు ఇక్కట్లు పడుతున్నారు. బాత్రూంలోకి నీరు రావాలంటే మోటర్ వేయాల్సిందే. కరెంటు లేకపోతే బాత్రుంలో ఆ రోజు నీరు లేనట్లే. ఈ సమస్య బాలికలను ఆవేదనకు గురి చేస్తోంది. వైసిపి ప్రభుత్వ పాలనలో నాడు-నేడు కింద దాదాపు రూ.7 కోట్లతో తల్లిశెట్టి శేషమ్మ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను నిర్మించారు. పాఠశాల భవనం బయటి మాత్రం అందంగా కార్పొరేట్ పాఠశాలగా కనపడుతున్నా.. పాఠశాలలో మాత్రం సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. బాత్రూంలోకి నీటి సరఫరా కోసం నిర్మించిన ట్యాంకు లీక్ అవుతోంది. పట్టిన నీరు వృథా అవుతోంది. ట్యాంకు లీకేజీతో పాఠశాల భవనానికి చెందిన గోడలు నెమ్ము ఎక్కుతున్నాయి. గోడలు ఉరుస్తున్నాయి. పనులు నాసిరకంగా చేయడంతో ఈ దుస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గత సిఎం వైఎస్ జగన్‌చే పాఠశాలను ప్రారభం చేయాలనే ఉద్దేశంతో పనులు హడావుడిగా చేసినట్లు పలువురు పేర్కొంటున్నారు. పాఠశాల భవనంపై నిర్మించిన నీటి ట్యాంకు సరిగా కట్టలేదని, మోటర్ ద్వారా నీటిని నింపిన కొద్ది గంటల్లోనే నీరంతా పోతున్నట్లు ఉపాధ్యాయులు అంటున్నారు. స్తంభాలను మార్చే పనులు చేస్తుండడంతో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపి వేస్తున్నారు. కరెంటు సరఫరా లేక మోటర్లు ఆడకపోవడంతో బాత్రూంలోకి నీరు రావడంలేదు. పాఠశాలకు వచ్చిన బాలికలు, మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. బాత్రూంలోకి నీరు రాకపోతే ఆడపిల్లలు బయటికి ఎలా వెళతారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి ట్యాంకును మరమ్మతులు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఉపా ధ్యాయులు కోరినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. బాలికలకు, మహిళ ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా సింథటిక్ ట్యాంకులైనా ఏర్పాటు చేసి బాత్రూంలోకి నీటి సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాత్రూం నుంచి వెదజల్లుతున్న దుర్వాసన

జిల్లా పరిషత్ బాలికల పాఠశాల బాత్రూంల్లో దుర్వాసన వెదజల్లుతోంది. ఉపాధ్యాయులు, బిలికలు బాత్రూంలోకి వెళ్లేలేక ఇబ్బందులు పడుతున్నారు. బాత్రూంలో ఉన్న పైపులు బ్లాక్ కావడంతో నీరంతా అక్కడే నిలిచిపోయింది. దుర్వాసన తరగతి గదుల్లోకి వస్తున్నట్లు వాపోతున్నారు. ట్యాంకులో నీరు లేక బిందెలతో తెచ్చుకొని వాడుకుంటున్నట్లు విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులు బ్లాక్ అయిన విషయం పాఠశాల హెచ్ఎంకు తెలిపినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. బాత్రూంలో కుళాయిలు కూడా విరిగి పోవడంతో ట్యాంకులో నీరు ఉన్న సమయంలో వృథాగా పోతోందని అంటున్నారు.

బాత్రూంలో నిలిచిన నీరు

మహాశివరాత్రికి అల్లాడుపల్లె ముస్తాబు

ప్రజాశక్తి - చాపాడు

ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించు మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవ స్థానంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. 26న స్వామివారికి అభిషేకం, స్వామివారి కల్యాణం గ్రామోత్సవం, జాగరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాగరణ సమయంలో భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నందికోలు ఉత్సవాలు ఉంటాయి. 27న రాష్ట్రస్థాయి ఎడ్లచే బండ లాగుడు పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పది రోజుల పాటు ప్రథమ బ్రహ్మోత్సవాలు ఈనెల 19నుంచి 28వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. శివరాత్రి సందర్భంగా దేవస్థాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంతోపాటు సర్వజన అన్నదాన సత్రం, ఆర్యవైశ్య, విశ్వబ్రాహ్మణ సత్రాల్లో అన్నదానం చేయనున్నారు.

ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు

దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేపడుతున్నాం. ఇప్పటికే బారికేడ్లు, తాగు నీరు, పార్కింగ్, జాగరణ సందర్భంలో విద్యుత్ దీపాల ఏర్పాటు పర్య వేక్షిస్తున్నాం. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిత్యం పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపడుతున్నాం. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగుతున్నాం. ఆలయ కమిటీ సభ్యులకు ప్రజలు సహకరించి శివరాత్రి మహా పర్వదినం సందర్భంగా రెండు రోజులు, ప్రస్తుతం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి.

- పెరుగు వీరనారాయణ యాదవ్, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్

కార్యక్రమాలను విజయవంతం చేయాలి

మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలి. అన్ని వసతులను ఇప్పటికే అధికారులు, పోలీసులతో కలిసి ఏర్పాట్లు ప్రారంభించాం.

- శ్రీనివాసులు, ఇఒ, అల్లాడుపల్లె దేవళాలు

అక్రమ అరెస్టులు దుర్మార్గం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నిరుద్యోగులు, డివైఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులను ఖండించలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ తెలిపారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రూప్-2 అభ్యర్థులు రోస్టర్ విధానంలో తప్పులను సరిచేసిన తర్వాత పరీక్షలు నిర్వహించాలని మొదటి నుంచి పోరాటం చేస్తూన్నామన్నారు. మూడు రోజుల నుండి తీవ్రమైన ఆందోళనలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నా వాటిని నీరు గార్చడానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా కృషి చేసి చివరి వరకు మాయమాటలు చెప్పి నమ్మించి నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఖండించారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచుతోందన్నారు. నిరుద్యోగులపై ఖాకీ పెత్తనం చేయడానికి ప్రయత్నించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పరీక్ష అయిపోయినా సరే కూటమి ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. మెగా డిఎస్‌సి విడుదల చేస్తామని, మొదటి సంతకం పెట్టి ఎనిమిది నెలలైనా నోటిఫికేషన్ విడుదల చేయకుండా మోసం చేశారని తెలిపారు. కాని స్టేబుల్ అభ్యర్థులకు కోర్టు కేసు పేరుతో కాలయాపన చేసి ఫిజికల్ ఈవెంట్స్‌లో కూడా చాలా తప్పుడు తడకలుగా చేసి అభ్యర్థులు కోర్టుల చుట్టూ తిరిగేలాగా ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. అడుగడుగునా నిరుద్యోగులకు ఇచ్చిన మాటను తప్పడం, మాయమాటలు చెప్పి మోసం చేయడం తప్ప ప్రభుత్వం న్యాయంగా వ్యవహరించడం లేదని ఆరోపించారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ఖాజీపేట : పాటిమీదపల్లె గ్రామంలో ఆదివారం గంగమ్మ తల్లి విగ్రహప్రతిష్టాపన ఘనంగా జరిగాయి. పురవీధుల్లో అమ్మవారి విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్రైనీ డిఎస్‌పిగా భవాని

చాపాడు : ట్రైనీ డిఎస్‌పిగా భవాని చాపాడు పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. మూడు వారాలపాటు ఆమె శిక్షణ పొందనున్నారు. గత ఏడాది గ్రూప్-1 పరీక్షలో డిఎస్‌పిగా ఎంపికయ్యారు. ఆర్‌టిపిపికి చెందిన భవాని గతంలో చాపాడు డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పోటీ పరీక్షలో డిఎస్‌పిగా ఎంపికయ్యారు.

మూగ జీవాల దాహార్తిపై ఏదీ దృష్టి..?

అటవీ అధికారుల నిర్లక్ష్యంపై జంతు ప్రేమికుల మండిపాటు-దాతల సాయంతో తొట్లకు నీరు

ప్రజాశక్తి - ఖాజీపేట

'వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.. అడవులను రక్షిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి' అంటూ గొప్పగా ప్రగల్బాలు పలుకుతున్న అటవీ అధికారులకు మాత్రం వన్యప్రాణుల సంరక్షణ గోడు పట్టడం లేదు. వేసవి కాలం సమీపించింది.. పగటి ఉష్ణోగ్రతలు మండిపోతున్నాయి. అడవుల్లో సైతం భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఏ చోట,, ఎక్కడ వెతికినా గుక్కెడు మంచినీరు కనిపించని పరిస్థితి. అడవుల్లో సంచరిస్తున్న మూగజీవాలు మంచినీరు, ఆహారం కోసం అలమటించి పోతున్నాయి. వన్యప్రాణులను సంరక్షించాల్సిన అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వేసవికాలం దృష్ట్యా మూగజీవాలకు తాగునీటి వసతి కల్పిం చాల్సిన అధికారులు ఆ చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో మూగజీవాలు ఆకలి దప్పికలతో అలమటించిపోతున్నాయి. నీటి తొట్లు ఏర్పాటు చేసి దాహం తీర్చాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జంతు ప్రేమికులు, పర్యావరణ పరిరక్షకులు, వన్యప్రాణి సంరక్షణ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు చేయాల్సిన పని కొందరు మానవతవాదులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మానవత్వంతో మూగజీవాల రోదనను అర్థం చేసుకొని వ్యయ ప్రయాసలకోర్చి మంచినీటిని తొట్లకు నింపుతున్నారు. ఆ నీటిని తాగి మూగ జీవాల దాహాన్ని తీర్చుకుంటున్నాయి. వనిపెంట-బ్రహ్మంగారిమఠం-పోరుమామిళ్ల మార్గమధ్యంలోని వివిధ ప్రాంతాలు, ఖాజీపేట మండలంలోని నాగసానిపల్లి ఖాజీపేట మార్గంలో వానరాలకు నీటి తొట్లను అందుబాటులో ఉంచి దాహార్తిని తీరుస్తున్నారు. మీకోసం సేవా సంస్థ, నేస్తం సేవా సంస్థ, అమ్మ సేవా సమితి వంటి స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు దాతల సహకారంతో మూగ జీవాలకు ఆహారం, మంచినీటిని అందిస్తున్నారు. అటవీ అధికారులు వన్యప్రాణుల సంరక్షణపై ఎలాంటి దృష్టి సారించడం లేదని పలువురు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, జంతు ప్రేమికులు ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. మైదుకూరుకు చెందిన నేస్తం సేవా సంస్థ ప్రతినిధులు సమయం చూసుకొని స్నేహ బృంద సభ్యులందరూ ద్విచక్ర వాహనాలపై వెళ్లి బిందెల ద్వారా సమీప ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చి తొట్లకు నింపి దాహం తీరుస్తున్నారు. స్వచ్ఛంద సేవకులు చేస్తున్న కృషిని మానవతావాదుల అభినందిస్తున్నారు. వారి శక్తిమేర ఆర్థికసాయం అందిస్తున్నారు. వన్యప్రాణుల సంరక్షణపై అటవీ అధికారులు శ్రద్ధ వహించాలని, వాటి అవసరాలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ట్యాంకర్ ద్వారా తొట్లకు నీరుపోస్తున్న స్వచ్ఛంద సేవకులు

మంజూరు పత్రాన్ని అందజేస్తున్న వరుణ్‌కుమార్‌రెడ్డి

సిఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కాలేయ వ్యాధితో బాధపడుతున్న సకిలి అశోక్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన రూ.10లక్షల మంజూరు పత్రాన్ని స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయసేవా కేంద్రంలో ఆదివారం సంస్కృతి స్వచ్ఛంద సేవాసంస్థ సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి అంజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాళ్లమాపురం గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి కొన్ని నెలలుగా కాలేయ వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ హైదరాబాద్‌లోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. బాధితుడి సమస్యను తెలుసుకున్న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అతని చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.10లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. మంజూరు పత్రాన్ని రోగి సోదరుడు సకిలి వెంకటసుబ్బారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ అర్థికసాయం అందజేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఒంటేరు భాస్కర్‌రెడ్డి, షెక్షావలి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఆవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగం, నవీన్ న్యూరో కేర్ (కడప) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 305 మంది రోగులను కడపకు చెందిన ప్రముఖ న్యూరో వైద్యులు డాక్టర్ నవీన్ ప్రసాద్ చికిత్సలు చేశారు. షుగర్, బిపి పరీక్షలతోపాటు రూ.3వేలు విలువ చేసే ఎముకల సాంద్రత పరీక్ష, రూ.2 వేలు చేసే నరాల పటుత్వ పరీక్షతోపాటు ఇతర జబ్బులకు వైద్య పరీక్షలు ఉచితంగా చేశారని సునీల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అవోపా సభ్యులు, మహిళా విభాగం సభ్యులు, ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక శిల్పారామంలో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. ప్రభాకర్ లగ్జరీ విహార్, కమ్యూనిటీ లే అవుట్ పులివెందుల వారి సహకారంతో మాస్టర్ రాకింగ్ స్టార్స్ డ్యాన్స్ అకాడమీ, ధర్మవరం వారు నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో కళా ప్రాంగణం మోగిపోయింది. డ్యాన్స్ మాస్టర్ సర్వన్, నృత్య శిక్షకులు లోకేష్, అస్లాం, రాజుల ప్రభాకర్‌రెడ్డి, శిల్పారామం అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తలనీలాల బహిరంగ వేలం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో భక్తులు తమ మొక్కలు ద్వారా తలనీలాలు సమర్పించుకుంటారు. వాటిని ప్రోగు చేసుకొనుటకు సోమవారం బహిరంగ వేలం టెండర్లు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు సమర్పించే టెంకాయల చిప్పలను కూడా అదే రోజు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో హిందూ మతస్తులు మాత్రమే పాల్గొనాలన్నారు. తలనీలాలు ప్రోగు చేసుకొనుటకు వేలం పాటలో పాల్గొనే వారు రూ.25 లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొనుటకు వేలం పాటలో పాల్గొనేవారు రూ.3లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంపాట దక్కించుకున్న వారు 50శాతం అదే రోజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పైన తెలిపిన హక్కులను నిలుపుదల చేయుటకు, వాయిదా వేయుటకు దేవస్థాన కార్యనిర్వాహణ అధికారికి పూర్తి అధికారం ఉంటుందన్నారు.

బొమ్మిశెట్టి మోహన్‌ను సన్మానిస్తున్న కాపు సంఘం నేతలు

కాపుల అభ్యున్నతికి కృషి చేయాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

కడప జిల్లా ప్రాంత కాపు విద్యార్థులు ఉన్నతంగా విద్యను అభ్యసించి గొప్ప కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కాపు సంఘం నాయకులు ఆకాం క్షించారు. మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ద్వితీయ వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ బొమ్మిశెట్టి మోహన్ మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి అందరూ విశేషంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాపులంతా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అంకితభావం, సేవా తత్పరత, దృఢ సంకల్పం, కార్యదీక్షను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాపులు అగ్రకులాలవారైనా ఎంతో అట్టడుగు స్థాయిలో కడు పేదరికాన్ని అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. కాపులంతా ఇతర ప్రజానీకానికి ఆదర్శనీయంగా ఉండాలని కోరారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు సహకరిస్తున్న బొమ్మిశెట్టి మోహన్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. మేధా విద్యా సంస్థల చైర్మన్ చెన్నంశెట్టి నరసింహులు, విఆర్ జూనియర్ కళాశాల చైర్మన్ శీలం వెంకటరాముడు, శ్రీకృష్ణదేవ రాయల పుస్తక యజమాని నరేంద్ర రాయల్, విజయ్‌కుమార్, బొల్లు రామ్మోహన్ పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో సింహాద్రిపురం హైస్కూల్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురంలో నూతనంగా నేర్పించిన జిల్లా పరిషత్ హైస్కూల్ భవనాలు కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తీసిపోని విధంగా నిర్మించారని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన జిల్లా పరిషత్ హైస్కూల్ పరిశీలించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల నిర్మాణం అద్భుతంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇదే విధంగా ఉండేందుకు నిర్వహణ బాధ్యతగా చేపట్టాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల కోసం సైన్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారన్నారు. ఇలాంటి మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద విద్యార్థులతో ఎన్.తులసిరెడ్డి